

యాంత్రీకరణలో కదలిక

- రైతులకు రాయితీపై వ్యవసాయ ఉపకరణాలు అందజేసే యోచన
- యాసంగి సీజన్ నుంచే అమలుకు ప్రణాళిక
- ఆరేళ్ల అనంతరం సర్కార్ చర్యలు

రాష్ట్రంలో ఆరేళ్లుగా నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఈ పథకాన్ని అమలు చేస్తే రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, యంత్రాలు రాయితీపై అందనున్నాయి.



బెజ్జూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణ పథకం పునరుద్ధరించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్లు, ఇతర పరికరాలతోనే సాగు చేసేందుకు రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు. కూలీల సమస్యను అధిగమించడంతో పాటు పనులు త్వరగా పూర్తయ్యేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు. ఉపకరణాలపై రాయితీ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో వారికి ఊరట లభించినట్లయింది. ఈ పథకం రాష్ట్రంలో ఆరేళ్లుగా అమలు కావడం లేదు. ఈ యాసంగి సీజన్ నుంచే ప్రారంభిస్తుండడం శుభ పరిణామంగా బావిస్తున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 15మండలాల పరిధిలో 4.5లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు.

పథకంలో భాగంగా..

ఫాం మెకనైజేషన్ పథకంలో భాగంగా గతంలో ట్రాక్టర్లు, సామగ్రి అందజేశారు. ముఖ్యంగా గొర్రు, రోటోవేటర్, మూడుకాళ్ల నాగళ్లు, రొప్పు, ఆప్‌కేజ్ వీళ్ల(సగం దమ్ము చక్రాలు)చిన్న ప్లౌవ్, పెద్ద ప్లౌవ్, పురుగు మందు పిచికారి చేసే డబ్బాలు గతంలో 50శాతం రాయితీపై అందుబాటులో ఉండేవి. రైతులు వీటిని కొనుగోలు చేసి సేద్యం చేసేవారు. ప్రతి వ్యవసాయ కార్యాలయాల వద్ద అవి ఎప్పుడు సిద్ధంగా ఉంచేవారు. ట్రాక్టర్లు ఉన్న రైతులు వీటిని తీసుకెళ్లేవారు. అనంతరం పూర్తిగా నిలిపివేశారు.

పల్లెల్లో ట్రాక్టర్లు..

జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ట్రాక్టర్ల ద్వారానే పొలాలు, భూములు దున్నుతున్నారు. సేద్యం పనులకు ఎక్కువగా ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు. ముఖ్యంగా భూమి చదును చేసే గొర్లకు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఆరేళ్లుగా రాయితీని నిలిపివేశాక ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా రైతులకు అవసరమైన రోటోవేటర్లు, దమ్ముచక్రాలు, తైవాన్ స్ప్రేయర్లు రాయితీపై లభిస్తే చాలామంది కొనుగోలు చేసే అవకాశం ఉంది.

పరికరాల ఉపయోగాలపై..

పరికరాల ఉపయోగాలపై అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. మొదట వ్యవసాయ పరికరాలు, యంత్రాలతో జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నారు. వీటిలో పరికరాల ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు, నిపుణులు పాల్గొని వాటి ఉపయోగం, పనిచేసే విధానం, రాయితీ అంశాలపై వివరించనున్నారు. అదే సమయంలో అవసరమున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకొని అర్హులకు అందజేయనున్నారు.

అందించేవి ఇవే..

పవర్ టిల్లర్లు, హార్వెస్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, రోటర్‌వేటర్లు, మామిడికాయలు తెంపే పరికరం, పత్తితీత, గడ్డికత్తిరింపు, మొక్కజొన్నలను ఒలిచే యంత్రాలను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కేజ్‌వీల్స్, నాగళ్లు ఇస్తే బాగుంటుందని రైతులు చెబుతున్నారు.

రైతులకు ప్రయోజనం..



వ్యవసాయ పరికరాలు రాయితీపై అందిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. కూలీ ధరలు సైతం అధికంగా ఉన్నాయి. వ్యవసాయ పని ముట్లు అందజేస్తే పని సులువవుతుంది. కూలీల కొరత నుంచి కూడా ఉపశమనం ఉంటుంది.

సడ్మెక ముత్తయ్య, రైతు, కుకుడ

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం..



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రైతులకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం. గతంలో యాంత్రీకరణ పథకంపై ప్రభుత్వం ప్రకటన మాత్రం విడుదల చేసింది వాస్తవమే. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఆదేశాలు వస్తే అర్హులకు అందజేస్తాం.

నాగరాజు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు

గిన్నెధరిలో 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెధరిలో బుధవారం 7.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. సిర్పూర్(యూ)లో 7.8 , కెరమెరిలో 9.1, చింతలమానేపల్లిలో 9.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఆర్థిక సాయం

దండేపల్లి, జనవరి22(ఆంధ్రజ్యోతి): దండేపల్లి ఎస్సీ కాలనికి చెందిన నిరుపేద యువతి మంద అక్షితకు దండేపల్లికి చెందిన శీ సత్యసాయి భజన మండలి వారు రూ.25వేల పోగు చేసి అందజేసి అండగా నిలిచారు. మండల కేంద్రానికి మంద రాజు గత నెల31 రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



పోలీసులు గుర్తించిన బెల్లం పానకం

తిర్యాణి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. మాణిక్యాపూర్ శివారులో గుడుంబా స్థావరాలపై బుధ వారం దాడులు చేశారు. ఈ నాటు సారాకు ఉపయోగిస్తున్న బెల్లం పానకంను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

అల్పాహారం పంపిణీ

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జడ్పీఎస్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు ఆధ్వర్యంలో చేపడుతున్న అల్పాహారం పంపిణీ కొనసాగుతోంది. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వినోద్, కార్తీక్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని వాసవి విద్యా మందిర్‌లో 2013-14లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థి తిలక్‌కు అప్పటి తోటి స్నేహితులు రూ.82 వేల ఆర్థిక సహాయం కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, సాయికృష్ణ, ఆకాష్, హరికృష్ణ, సమ్మన్న, సాయిప్రణీత్, పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

కౌటాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్కి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉదాన విశ్వ విద్యాల ప్రొఫెసర్ శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

హిందూ పరిరక్షణ సమతి ఆధ్వర్యలో ర్యాలీ

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో శ్రీరామ హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జన్కాపూర్ రామాలయం నుంచి బాల రాముడి విగ్రహంతో పెద్ద ఎత్తున ప్రజలు ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, నాయకులు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత



పదోన్నతి చిహ్నం అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా హెడ్ క్వార్టర్‌లో పదోన్నతి పొందిన పలువురు హెడ్ కానిస్టేబుళ్లు కిశోర్, ప్రభాకర్, నర్సింగ్, అంబారావు, సిరాజ్ హుస్సేన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు పెద్దన్న, అంజన్న, మీరా, విజయ శంకర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు చేతుల మీదుగా జిల్లా పోలీసు అసోసియేషన్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశంకర్ రెడ్డి, వైస్ ప్రసిడెంట్ మోహన్, స్వామి, దేవాజీ, నాగుల్ మీరా, ఆర్ఎస్సై ఓదేలు, సీసీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అగ్ని ప్రమాదాల్లో ఆస్తులు కాలిపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలోనూతనంగా ప్రభుత్వం కేటాయించిన అగ్ని మాపక వాహనాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఆసిఫాబాద్ అగ్నిమాపక కేంద్రానికి నూతన వాహనాన్ని కేటాయించిందని చెప్పారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ అగ్ని మాపక కేంద్రంలో 2 వాహనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కాగజ్‌నగర్ కేంద్రంలో ఒకటి ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ అలీబీన్ అహ్మద్, అగ్నిమాపక అధికారులు కార్తీక్, భీమన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బేటీ బచావో.. బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ భవన సముదాయం ఆవరణ నుంచి కుమరం భీం చౌరస్తా వరకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం పదేళ్ల పూర్తయిన సందర్భంగా మార్చి 8వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, అధికారులు శారద, మమత, రాణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తులు చేసుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు



కాగజ్‌నగర్ మండలం వంజిరిలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల జాబితాలో పేర్లు రాని వారు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాల్లో జాబితాలో లేని పేర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులు తిరిగి దరఖాస్తులు సమర్పిం చవ్వరని చెప్పారు. వ్యవసాయ సాగుకు యోగ్యంగా ఉన్న భూములకు రైతు భరోసా వర్తింప చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిర్మ భరోసా, రేషన్‌కార్డు కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకవాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేక పోతే నిరాశ పడకుండా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రబ్బానీ, పీఏసీఎస్ ఛైర్మన్ పెంటయ్య, ఎంపీవో అజీజుద్దీన్, ఏపీవో శ్రావణ్, శివ, ఏఈవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

బెజ్జూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని పెద్ద సిద్దాపూర్ రెబ్బెన, మర్తిడి, అందుగులగూడ గ్రామాల్లో గ్రామసభలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ భూమేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న నాలుగు పథకాలకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. జాబితాలో అర్హులైన దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల పేర్లు లేక పోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గౌరి శంకర్, కార్యదర్శి వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌక, లగ్గాం, ఇట్యాల, గిరివెల్లి, చిన్నరాస్పెల్లి, దిగిడ గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామ సభలు కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కవిత మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని డోర్పల్లి, కర్జపల్లి, కొమ్ముగూడ, లక్ష్మీపూర్ తదితర గ్రామాల్లో బుధవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. రాని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమం లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో కమలా కర్, డీటీ బక్కయ్య, నేహతబసుం, శోభరాణి, విశాల్, రవికుమార్, గిర్దావర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. అర్హులైన వారిని ఎంపిక చేయలేదని గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీటీ మష్కూర్ అలీ మా ట్లాడుతూ పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



వాంకిడిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

గ్రామసభలో వాగ్వాదం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

చింతలమానేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించి న గ్రామసభలో సంక్షేమ పథకాల్లో అర్హుల పేర్లు లేవని పలువురు వాగ్వాదానికి దిగారు. ఎంపీడీవో కోట ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన గ్రామసభను అధికారులు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో గ్రామానికి చెందిన ఎవరెవరి పేరు ఉన్నాయని, వారి పేర్లను బహిర్గతం చేయాలని అధికారులను నిలదీశారు. రేషన్ కార్డులు అర్హులైన వారికి అందడం లేదని చెప్పారు. అర్హులైన వారందరికి న్యాయం చేయక పోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో ఇందిరమ్మ కమిటీని రద్దు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు. తమకు రద్దు చేస్తున్నట్లు ఓ పత్రంలో రాసి ఇవ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. దీంతో సభ అర్థాం తరంగా ముగిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులందరికి లబ్ధి చేకూరేలా తాము పని చేస్తామని, జబితాలో పేర్లు రానివారు దరఖాస్తుచేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న దీక్షలు



నిరసన తెలియజేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఈ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం పలువురు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం రావడం లేదని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి కైనా తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, రమేశ్, సురేందర్, రాజ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలి

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని డీడీ రమాదేవి అన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రముఖులు మోవాడ పాఠశాల, జిల్లా కేంద్రంలో బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించారు. ప్రాజెక్టు ఆఫీసర్ పర్యవేక్షలో గిరిజన విద్యార్థులకు ఆంగ్ల భాష సామర్థ్యాల పెంపు కోసం విబాగలీవ్ ఏ వార్డ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అభ్యాసన కార్యక్రమం నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, ప్రోగాం మేనేజర్ వీర నారాయణ, ఐఎఫ్‌డ బ్ల్యూ టీఎం సభ్యులు ప్రశాంత్, లక్ష్మణ్, విజయ్‌కుమార్, ఎస్ఎం కర్జు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా ప్రత్యేక రైళ్లు

- ప్రయాణికుల అవస్థలు
- గంటల తరబడి వేచి చూస్తున్నామని ఆవేదన

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ నుంచి వెళ్లే ప్రత్యేక రైళ్లు ఆలస్యంగా వస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాగజ్‌నగర్ నుంచి అటు మహారాష్ట్ర ఇటు సికింద్రాబాద్ మీదుగానే కాకుండా చెన్నై వైపు కూడా ప్రధాన మార్గంగా ఉంది. రోజూ వారీగా రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఢిల్లీ-సికింద్రాబాద్, ఢిల్లీ-చెన్నై వైపు వెళ్లే రైళ్లు కూడా కాగజ్‌నగర్ మీదుగా వెళుతుంటాయి. కాగా జిల్లాలోని ఏకైక ప్రధాన రైల్వే స్టేషన్ కాగజ్‌నగర్. దీంతో పాటు ఇటీవల మహాకుంభ మేళాకు సైతం ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. ఈ రైళ్లన్నీ 3, 6, గంటలు, 12 గంటలు ఒక్క రోజు ఆలస్యంగా నడుస్తుడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో నడుస్తున్న రైళ్లు ఆలస్యంగా రావడంతో గంటల తరబడి ప్రయాణికులు వేచి ఉండాల్సిన రావడంతో ఇబ్బంది పడుతున్నారు. కాగజ్‌నగర్ నుంచి ప్రయాగ, వారణాసి, ప్రయాగ్ రాజ్ చోకి, దీన్ దయాళ్ ఉపాధ్యాయ, తదితర కాశీ సమీప స్టేషన్‌లకు వెళ్లాల్సిన, అక్కడి నుంచి రావాల్సిన రైళ్లు సకాలంలో గమ్య స్థానాలకు చేరడం లేదు. కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన స్పెషల్ ఎక్స్‌ప్రెస్(07052) రాత్రి 11 గంటలకు చేరుకోవాల్సి ఉంది. కాగా సికింద్రాబాద్‌కు ఉదయం 10 గంటలకు చేరుకుందని ప్రయాణికులు తెలిపారు. మహా కుంభ మేళా స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (07708) కాగజ్‌నగర్‌కు ఉదయం 7.30కు రావాల్సి ఉండగా ఒంటిగంటకు చేరుకుంది. 07420 సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి 11.50కు రావాల్సి ఉండగా ఉదయం 6గంటలకు రావడంతో ఇబ్బందులు పడ్డారు. కాగజ్‌నగర్ మీదుగా వెళ్లాల్సిన 07648 స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కూడా రాత్రి 7 గంటలకు కాగజ్‌గనర్ రావాల్సి ఉండగా తెల్లవారి 5 గంటలకు చేరుకుంది. కాగజ్‌నగర్ మీదుగా కాశీ కుంభమేళాకు వెళ్లాల్సిన ప్రయాణికులు సమీపంలోని ప్రయాగ్ రాజ్ దగ్గరవుతుంది. కానీ వీరికి ప్రయాగ్ రాజ్ చోకి, వారణాసి, దీన్‌దయాల్ ఉపాధ్యాయ స్టేషన్‌లోనే నిలుపుదల చేస్తున్నారు. వెళ్లే ప్రత్యేక రైళ్లు కూడా 6గంటలు, 12 గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నాయని చెబుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అభివృద్ధి చేస్తున్నాం

మంచిర్యాల క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్నామని, అవినీతికాదని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు, పట్టణ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, నరేష్ అన్నారు. బుధవారం మహాప్రస్థానం వద్ద వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే దివాకర్‌రావు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్కల హేమలత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఛైర్మన్‌కు సన్మానం

మంచిర్యాల క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఛైర్మన్, కౌన్సిలర్ల పదవీకాలం ఈ నెల26తో ముగియనున్న సందర్భంగా మున్సిపల్‌కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు మంచిర్యాల ఛైర్‌పర్సన్ ఉప్పలయ్యను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, కౌన్సిలర్ నల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి బైండోవర్

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని బాలాజీ నగర్‌లో మట్కా నిర్వహకుడిని బైండోవర్ చేసినట్లు కాగజ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు బాలాజీ నగర్‌లోని పోతుల సాయి కిరణ్ ఇంటిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించామన్నారు. నిందితుడి ఇంట్లో ప్రింటర్, మట్కా చిట్టీలు, కెమెరా స్టాండ్, సెల్‌ఫోన్ లభ్యం అయినట్లు పేర్కొన్నారు. సాయికిరణ్ కొంత కాలంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మట్కా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం 1లో ఆర్వోబి వైపు గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమయినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. మృతుని వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతదేహాన్ని సీహెచ్‌సీలో భద్రపరిచినట్లు తెలిపారు.

కారు ఢీకొని కార్మికుడికి గాయాలు

జైపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న గూడురు అజయ్‌ను కారు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. బుధవారం విధుల్లో భాగంగా భోజనసమయంలో తనబైక్‌పై బయటకు వస్తున్న క్రమంలోఎస్టీపీపీ క్వార్టర్స్ నుంచి బయటకు వస్తున్న ఎస్ఈ ప్రసాద్ అనే సింగరేణి అధికారి కారు అజయ్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అజయ్ గాయ పడ్డాడు. వెంటనే అతడిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పంచాయితీలో ఘర్షణ

దండేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో పలువురికి గాయా లయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వెల్గనూరు గ్రామానికి చెందిన ఓ జంట మధ్య కొద్ది రోజులుగా మన స్పర్థలు వస్తున్నాయి. దీంతో ఇటీవల భార్య దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భార్య భర్తల మధ్య గొడవ కదా మేము పరిష్కరిస్తామని పెద్దమనుషులు చెప్పి ఒప్పించడంతో పోలీసులు సరే అన్నారు. ఈ నేపథ్యంలో పంచాయితీలో మాటామాట పెరగగా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు సమాచారం. ఈవిషయమై ఎస్సై ఉదయ్ కిరణ్‌ను సంప్రదించగా గొడవ జరిగింది వాస్తవమేనని, దాడికి పాల్పడ్డవారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలో చెట్ల నరికివేత

- రూ.50వేలు జరిమానా విధించిన అటవీ అధికారులు

బెల్లంపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవో కార్యాలయంలోని టేకు, ఇతర చెట్లను నరికివేయడంతో అటవీశాఖ అధికారులు రూ.50వేల జరిమానా విధించారు. పది రోజుల క్రితం కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్ల నమూనాకు సంబంధించిన ఇంటి నిర్మాణం చేపట్టడం కోసం చెట్లను నరికివేశారు. ఈవిషయంపై బీఆర్ఎస్ నాయకులు అటవీశాఖ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అటవీశాఖ అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో చెట్లను నరికివేసే విషయంపై విచారణ చేపట్టారు. దుగ్నేపల్లి గ్రామ మాజీసర్పంచు, కాంగ్రెస్ నాయకుడు డోలె సురేష్ ఆధ్వర్యంలో చెట్లు నరికివేశారని విచారణలో తేలడంతో అటవీ శాఖ అధికారులు రూ.50వేల జరిమానా విధించారు.

కోతులకు ఆహారం అందించిన వారికి జరిమానా

హాజీపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పాత మంచిర్యాల సెక్షన్‌లోని తిమ్మాపూర్ బీట్ అడవిలో రోడ్డు పక్కన కోతులకు ఆహారం అందించిన వారికి అటవీశాఖ అధికారులు జరిమానా విధించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు యువకులు కోతులకు ఆహారం వేస్తుండగా పట్టుకుని వాటికి ఆహారం వేయడం వల్ల జరిగే అనర్థాలపై వివరించి రూ. 4 వేలు జరిమానా విధించామని ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్‌వో సుభాష్ తెలిపారు.

గంజాయి కేసులో నలుగురికి జైలు శిక్ష

కెరమెరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తూ విక్రయిస్తున్న నలుగురి నిందితులలో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా, మరో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పు చెప్పారు. కెరమెరి ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 సెప్టెంబరు 21న అప్పటి ఎస్సై రమేశ్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తూ గోయగావ్ గ్రామంలో గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు గంజాయి కలిగి ఉన్న నలుగురు వ్యక్తులు కదవండి ప్రవీణ్, గొండ ప్రణయ్, చౌదరి మణికంఠతో పాటు మోహర్లే మధుకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అప్పటి సీఐ సుధాకర్‌పై వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా పీపీ జన్మోహన్‌రావు, సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. ప్రవీణ్, ప్రణయ్, మణికంఠలకు సంవత్సరం జైలు శిక్ష, పది వేల జరిమానా విధించారు. మొహరె మధుకర్‌కు పది సంవత్సరాల శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్‌మోహన్‌రావు, ఏఎస్పీ చిత్తరంజ్, సీఐ సత్యనారాయణ, ఎస్సై విజయ్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్‌లను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కాగజ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ శివాలయ మూల మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్టు ఈసుగాం ఏఎస్సై హీరామాన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాస్పెల్లికి చెందిన శశికాంత్(21) తన తల్లిదండ్రులను కాగజ్‌నగర్ బస్టాండులో దింపేసి తిరిగి రాస్పెల్లికి వస్తున్న క్రమంలో ఈసుగాం మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనటంతో శశికాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. శశికాంత్ తండ్రి తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అమృత్ పథకంతో మరింత అభివృద్ధి



డ్రోన్ చిత్రీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అమృత్ 2.0 కింద ఎంపికైనందున మరిన్ని నిధులతో పట్టణం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కేంద్ర ప్రభుత్వం సర్వే ఆఫ్ ఇండియా అధికారులు డ్రోన్ సహాయంతో పట్టణాన్ని చిత్రీకరించే కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పథకంలో భాగంగా సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 పథకం కింద కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎంపిక కావడం శుభ పరిణామమన్నారు. డిజిటల్ మ్యాప్ ద్వారా పట్టణాభివృద్ధికి ప్రణాళిక రూపొందించి నిధులు మంజూరు చేయిస్తామమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.





గోలేటిలో పెంచుతున్న పెరటి కోళ్లు

పెరట్లో కోళ్ల పెంపకం రైతులకు, నిరుద్యోగులకు మంచి ఉపాధినిచ్చే పరిశ్రమ. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తమ ఇళ్లల్లో సాధారణంగా 10 నుంచి 15 పెరటికోళ్లు పెంచుకుంటే అటు గుడ్లు, ఇటు మాంసం ద్వారా మంచి పోషకాహారం లభిస్తుంది. దీంతో పాటు కోళ్ల విక్రయాల ద్వారా లాభాలు గడించవచ్చు.

పెరటికోళ్ల పెంపకం.. లాభదాయకం

- ఆసక్తి చూపుతున్న రైతులు
- కోళ్ల ఫారం నిర్మాణానికి ఈజీఎస్ చేయూత

రెబ్బెన, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల పెంపకం సర్వసాధార ణం. నేడు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పెరటి (నాటు) కోళ్ల పెంపకం కనుమరుగైంది. పల్లెల్లో వాటి స్థానాలను బాయిలర్, లేయర్ కోళ్ల దుకాణాలతో భర్తీ చేశారు. పండగలకు, ఇతర వేడుకలకే కాకుండా ఇంటికి చుట్టాలు వచ్చినా, ఆదివారాల్లో ఇళ్లల్లో మాంసాహారం వంటల ప్రాధాన్యం పెరిగిపోయింది. మాంసం ప్రియులకు పోషక విలువలతో కూడిన మాంసాహారం అందించేందుకు పెరటి కోళ్ల పెంపకం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం పల్లెల్లో నాటుకోళ్ల ఫారాలు దర్శనమిస్తున్నాయి. మహిళ లను ఆర్థికంగా ప్రోత్సహిం చేందుకు ఐకేపీ (ఇందిరా క్రాతి పథకం) ద్వారా రుణాలు అందిస్తుండగా ఎన్ఆర్ఈజీఎస్ నుంచి ఉచితంగా ఫారం నిర్వహణకు షెడ్లను నిర్మించి ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. పెరటి కోళ్ల పెంపకంలో శ్రమ ఎక్కువ ఉన్నా నష్టాలు రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. బాయిలర్ కోళ్లతో పోల్చుకుంటే పెరగి కోళ్ల రుచే వేరుగా చెబుతారు. గోధుమ వర్ణంలో ఉంటే వీటి గుడ్లు కూడా ఆకర్షణీయంగా రుచిగా ఉంటాయి. దీంతో వీటికి మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది.

నష్టం లేదు..



- రమేశ్, గోలేటి

నాటుకోళ్ల పెంపకంతో ఎలాంటి నష్టం లేకుండా ఉంది. కాస్త శ్రమ పడితే చాలు. కోడి మాంసంతో పాటు గుడ్లు కూడా విక్రయిస్తున్నాం. వ్యవసాయంతో పాటు ఈ వ్యాపారం కూడా చేస్తున్నాను. లాభాదాయకంగా ఉంది. తన యూనిట్‌ను మరింత విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాను. వేసవిలో వ్యాధులు సోకకుండాజాగ్రత్తలు తీసుకోవాలి.

ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు..



- డాక్టర్ కార్తీక్, పశువైద్యాధికారి, రెబ్బెన

నాటుకోళ్ల పెంపకంతో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. కాస్త శ్రమ పడి ఆసక్తితో ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. ప్రభుత్వం తరుపున రుణాలు ఇచ్చే అవకాశాలు సైతం ఉన్నాయి. నష్టం ఉండదు. వేసవిలో వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి. కోడి పిల్లలను సంరక్షించుకుంటే ఆర్థికంగా లాభపడవచ్చు.

● గ్రామీణ ప్రాంతాల్లో..

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోళ్ల ఫారాలు కనిపిస్తున్నాయి. మార్కెట్‌లో నాటుకోళ్లకు మంచి డిమాండ్ ఉంది. గ్రామాల్లో నాటు కోడి కిలోకు 400 నుంచి 450 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. పట్టణాల్లో అయితే 450 నుంచి 500 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. దీంతో మహిళలను ఆర్థి కంగా ప్రోత్సహించేందుకు ఐకేపీ(ఇందిరా క్రాంతి పథకం) ద్వారా రుణాలు అందిస్తూ పెరటికోళ్ల పెంప కాన్ని అధికారులు ప్రోత్సహిస్తున్నారు. దీంతో యువత దీనిపై ఆసక్తి చూపుతోంది.

యువత వ్యసనాల బారిన పడొద్దు

- సీఐ బుద్దె స్వామి, రెబ్బెన



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: యువత మద్యం, మత్తుకు బానిస కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

సీఐ: గ్రామాల్లో యువకులు మద్యం మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పిస్తున్నాం. వారిని క్రీడారంగం వైపు తీసుకరావడానికి క్రీడా సామగ్రిని ఉచితంగా అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రెబ్బెన సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

సీఐ: రెబ్బెన సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు గానూ పోలీసు బృందాలనుఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పటిష్ఠం చేశాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

సీఐ: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తరుచూ వాహనాల తనిఖీలు చేస్తున్నాం. వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం.

- రెబ్బెన, (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని సీహెచ్‌సీ, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాన్నికలెక్టర్ వెంకటేశ్ దోత్రే బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, మెనో పట్టిక, వంట సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

కౌటాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఎన్‌పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. త్వరలో కౌటాలలో 132 కేవీ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

గంజాయి దహనం

ఆసిఫాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్‌లోల 53 కేసులలో సీజ్ చేసిన 117.3 కిలోల గంజాయిని బుదవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లోని నియమ నిబధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన గంజాయిని దహనం చేశామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

బెజ్జూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలు ట్రాఫిక్ నిబంధనలుపాటించేలా చూడాలని అడిషనల్ ఎస్సై ప్రవీణ్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు లైసెన్సు కలిగి ఉండాలని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కళాజాతా బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్వర్టులు

- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు
- మరమ్మతులు చేపట్టని అధికారులు



భూర్నూర్(కే) సమీపంలో కొట్టుకుపోయిన కల్వర్టు

సిర్పూర్(యు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపై నిర్మించిన కల్వ ర్టులు, రోడ్‌డ్యాంలు శిథిలావస్థకు చేరాయి. దీంతో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరదనీరు ప్రవహిస్తే భయాందోళనతో ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. సిర్పూర్(యు), దేవుడుపల్లి రోడ్డు మండల వాసులకు ప్రధానమైంది. ఈ రోడ్డు మీదుగా దేవుడుపల్లి, పూల్లర, సీతాగొంది, సీతాకర, పంగడి, చిన్నదోబ్బ, పెద్దదోబ్బ, బాజీపేట్, మాతుర తాండ, కకాడబోడి, పవర్‌గూడ, కంగూడ, బీజురిగూడ తదితర గ్రామాల గిరిజనులు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై ఉన్న వాగుపై గల రోడ్ డ్యాం మధ్యలో పగుళ్లు తేలింది. దీంతో వాహనాదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు అదుపుతప్పి పడిపోయిన సంఘటనలు సైతం చోటు చేసుకున్నాయని చెబుతున్నారు. మండలంలోని భూర్నూర్(కే) గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న వాగుపై నిర్మించిన కల్వర్టు ఐదేళ్ల క్రితం వరదలకు దెబ్బతిన్నది. అధికారులు ఇప్పటికీ మరమ్మతులు చేపట్టడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.



భూర్నూర్(కే) సమీపంలో శిథిలావస్థలకు చేరిన కల్వర్టు

ప్రమాదకరంగా కల్వర్టు..

- గెడం ప్రకాష్, భూర్నూర్(కే)



సిర్పూర్(యు) ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి భూర్నూర్(కే) గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఐదేళ్ల క్రితం వర్షాకాలంలో వరద ఉధృతంగా ప్రవహించి కొట్టుకుపోయింది. అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

రిపబ్లిక్ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి



ప్రగతి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం ఎల్‌వి సూర్యనారాయణ

శ్రీరాంపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రగతి స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న రిపబ్లిక్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. ప్రగతి స్టేడియంలో బుధవారం ఆయన వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. వేడుకలకు హాజరయ్యే ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) పి. అరవిం దరావు, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డీజీఎం (వర్క్‌షాప్) రవీందర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

● ఉద్యోగులు ముందుకు రావాలి..

శ్రీరాంపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు రెస్క్యూలో సేవలు అందించేందుకు ముందుకురావాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యానారాయణ అన్నారు. జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ విభాగంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న కన్నం సాంబయ్యను బుధవారం సన్మానించారు. అనంతరం జీఎం మాట్లాడారు. సాంబయ్య గత 25 ఏళ్లుగా రెస్క్యూలో సేవలందిస్తున్నారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఇటీవల ధన్‌బాద్‌లో జరిగిన రెస్క్యూ పోటీల్లో డీజీఎంఎస్, బీసీసీఎల్ ఆధ్వర్యంలో సాంబయ్యను సన్మానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఫైనాన్స్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు, కళల్లో రాణించడం అభినందనీయం



ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ డ్యూటీని నిర్వర్తిస్తూనే క్రీడలు, కళల్లో రాణించడం అభినందనీయమని ఆర్కే గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ స్వామి రాజు అన్నారు. గనిలో వెల్డర్‌గా పనిచేస్తున్న జంపయ్య కోల్ ఇండి యా స్థాయి సాంస్కృతిక పోటీల్లో ద్వితీయ బహుమతి, కోల్‌కట్టర్‌గా పనిచేస్తున్న అజయ్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో బహుమతులు సాధించారు. దీంతో బుధవారం గని ఆవరణలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టె రమేశ్, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీరాంపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఏరియాలోని న్యూటెక్ గనిలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో చనిపోయిన తాయబ్ కుటుంబానికి అధికారులు, ఉద్యోగులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. అధికారులు, ఉద్యోగులు సేకరించిన లక్ష 47 వేల 800 రూపాయలను ఆర్కే గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ స్వామిరాజు చేతులమీదుగా తాయబ్ భార్య ఆస్మాబేగంకు అందజేశారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టె రమేష్, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

ఉద్యోగుల ప్రాణాలతో చెలగాటం వద్దు

శ్రీరాంపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి అధికారుల ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీని బుధవారం ఆయన సందర్శించి ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. మైనింగ్, ఈ అండ్ ఎం సూపర్‌వైజర్లు, టెక్నీషియన్ల కొరత ఉందని, దీనివల్ల ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు పనిభారం ఎక్కువ అవుతోందని తెలిపారు. వెంటని సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, రమేష్, సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సంక్షేమమే యాజ మాన్యం లక్ష్యమని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. పట్టణంలోని 1వ జోన్‌లో కోటి పది లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు పనులను బుధవారం జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ పనులకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్య నారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్, బానయ్య, రాజేశ్వ ర్‌రావు, సివిల్ డీవైఎస్ ఈ జయ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ

జన్నారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల21న జిల్లాకేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఇంగ్లీష్ఒలింపియాడ్ పరీక్షలో కలమడుగు ఉన్నతపాఠశాలకు చెందిన జాడి ఆంజనేయప్రసాద్ ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా డీఈవో యాదయ్య విద్యార్థికి సర్టిఫికెట్, మెమెంటో అందించారు. విద్యార్థిని ఎంఈవో విజయ్కుమార్,హెడ్మాస్టర్ కట్టరాజమౌళి, గైడ్టీచర్ కవిత, ఉపాధ్యాయులు అభినందించారు.

టాలెంట్ టెస్టులో..

దండేపల్లి, జనవరి,22 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థి ఆర్ జర్పిత్ ఇటీవల నిర్వహించిన ఆంగ్ల భాష నైపుణ్య పరీక్షలో ప్రథమస్థానంలో నిలిచాడు. ప్రతిభకనబర్చిన విద్యార్థిని మంగళవారం పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతరకు నిధులు కేటాయించాలి

మందమర్రి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ జాతరకు నిధులు కేటాయించాలని జాతరకమిటీ నాయకులు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కలెక్టర్ కుమార్దీపక్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీసంవత్సరం ఫిబ్రవరిలో జరిగేజాతరకు నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

బడీడు పిల్లల సర్వే

కన్నెపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెపల్లి, జన్కాపూర్ క్లస్టర్ పరిధిలో బుధవారం సీఆర్పీలు నారాయణ, స్వామి బడీడు పిల్లల సర్వే నిర్వహించారు. 6నుంచి 14సంవత్సరాల పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా, 15 నుంచి 19సంవత్సరాల పిల్లను ఓపెన్ స్కూల్లో చేర్పించేలాసర్వే చేపడుతున్నామని తెలిపారు. సర్వే ఈ నెల 31 వరకు కొనసాగుతుందన్నారు.

ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి

శ్రీరాంపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని నస్పూర్ మున్సిపల్చైర్మన్ సురిమిల్ల వేణు అన్నారు. మున్సిపాలిటీలోని 9వ వార్డు నుంచి 16వ వార్డు వరకు వార్డు సభలు ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, నూతన్ రేషన్ కార్డుల మంజూరు, రేషన్కార్డుల్లో సవరణలు, రైతు భరోసా వంటి పథకాలను అందిస్తున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్చైర్మన్ గెల్లు రజిత-మల్లేష్, డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్వర్రావు, వ్యవసాయ, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



విచ్చలవిడిగా మాంసం విక్రయాలు

- నిబంధలకు బేఖాతర్
- పట్టించుకోని అధికారులు

లక్షెట్టిపేట, జనవరి,22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాంసం విక్రయ దుకాణాలు రోజు రోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ దుకాణాలు ఎక్కడ ఎడితే అక్కడ 20ఏండ్ల క్రితం గ్రామపంచాయ తీగా ఉన్న సమయంలో అప్పటి పాలకులు మాంసం విక్రయాల కోసం ప్రత్యేకంగా షెల్టర్ను ఏర్పాటు చేసారు. కానీ వ్యాపారులు మాత్రం దానిని వాడకుండా రోడ్డుకు దగ్గరలో ఉండేవిధంగా ఏర్పాటు చేసుకుని వ్యాపారాలను కొనసాగించడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా కొన్ని సంవత్సరాల క్రితం మహా రాష్ట్రకు చెందిన కొంతమంది వ్యాపారులు కరీంనగర్ చౌరస్తాలో మేకల మండిని ఏర్పాటు చేసుకుని అక్కడేమాంసం విక్రయ దుకాణాలు పెట్టారు. ఆ ప్రాంతం అప్పటి ఊత్కూర్ గ్రామ పంచాయతీలో ఉండటంతో అప్పటిపాలకులు అధికారులు వాళ్లకు అనుమతులు అందజేశారు. కానీ కొన్ని రోజుల క్రితం నుంచి పట్టణంలో మాంసం విక్రయ దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలిసాయి. మాంసం విక్రయదుకాణాలు ఎక్కడపడితే అక్కడ పెట్టుకోకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ ప్రస్తుతం వెలిసిన దుకాణాలకు అనుమతులుఎవరిచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

● నిబంధనలు పాటించని వ్యాపారులు..

మాంసం విక్రయాలు జరపాలంటే ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ముందుగా వాటిని (మేకలు, గొర్రెలు) కట్చేసే ముందు పశువైద్య శాలకు తరలించి వైద్యులు ఆరోగ్య పరిస్థితిని చూసి ఓకే చెప్పిన తర్వాత దానిని కట్ చేయాలి. వైద్యులు ధ్రువీకరించిన వాటినే కోసి తర్వాత వాటిలో ముఖ్యమైన భాగాలను మరోసారి ఆసుపత్రికి తీసుకువచ్చి స్టాంపింగ్ వేసి అప్పుడు దాన్ని దుకాణాల్లో పెట్టి అమ్మకాలు జరపాలి. దీనకి ప్రత్యేకంగా ఒక రికార్డును కూడా ఆసుపత్రిలో ఉంచాలి. కానీ లక్షెట్టిపేట పశుసంవర్ధక శాఖ అధికారుల వద్ద ఆలాంటివి ఏవీ లేవు. అంతే కాకుండా వ్యాపారులు స్వంతంగా స్టాంపులు తయారు చేసి వేసుకుంటున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ విషయంపై మీడయా ప్రశ్నిస్తే సరైన సమా ధానం కూడా ఇవ్వడం లేదు. వ్యాపారులు వ్యాపారం చేసే సమయంలో పరిశుభ్రతను పాటించాల్సి ఉం టుంది. వారి దుకాణంతో పాటు పరిసర ప్రాంతం మొత్తం శుభ్రంగా ఉంచుకోవాలి. కానీ ఇక్కడ ఎలాంటి శుభ్రత లేకుండా రోడ్డుకు ఆమడ దూరంలో దుమ్ము, దూళితోపాటు హైవే పక్కనే ఉండటంతో భారీ వాహనాలు పోతున్న సమయంలో వాటి పొగ కూడా మాంసంకు పట్టే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా పాతబస్టాండ్ ఏరియాలో మాంసం విక్రయాల దుకాణాల వద్ద పెద్ద సంఖ్యలో కుక్కలు తిరిగినప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వహించకుండా అనుమతులు లేని మంసాం దుకాణాల సముదా యాలను, నిబంధనలు పాటించని వ్యాపారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతు న్నారు.



రోడ్డుపై మాంసం విక్రయ దుకాణం

కొంతమందికే అనుమతులు ఉన్నాయి..



- కల్లెడ రాజశేఖర్. మున్సిపల్ కమిషనర్, లక్షెట్టిపేట

పట్టణంలో విచ్చలవిడిగా మాంసం విక్రయాలు జరుగుతున్నాయని మాకు ఫిర్యాదులు వచ్చాయి. కొంతమంది మాత్రం అనుమతులు తీసుకున్నారు. అను మతులు లేని వాటిపై నిబంధనలు, పరిశుభ్రత పాటించని దుకాణాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



- యాకూబ్రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ, లక్షెట్టిపేట

మాసం దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు. తప్పకుండా కట్చేసే ముందు దాని ఆరోగ్యపరిస్థితిని చూసి సర్టిపై చేయించుకున్నాకే దాన్ని కోయాలి. కోసిన తర్వాత కూడా ఆసుపత్రికి వచ్చి స్టాంప్ వేయించుకోవాలి. చాలా మంది రావటంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

వామ్మో చలి!

3వ పేజీ తరువాయి

సూచిస్తున్నారు. వృద్ధులు, పిల్లలను అవసరమైతే తప్ప...ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లకుండా చూడాలని పేర్కొంటున్నారు.

పొగమంచుతో వాహన చోదకుల ఇబ్బందులు..

విపరీతమైన చలికి తోడు పొగమంచు కారణంగా వాహన చోదకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ మంచుతో కప్పబడి ఉండ టంతో ఉదయం ఎనిమిది గంటలకు కూడా లైట్ల వెలుతురులో వాహ నాలను నడపాల్సి వస్తోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో ఆయా ఏరియాల్లో చలితీవ్రత అధి కంగా ఉంటోంది. ఇళ్లలో ఫ్యాన్లు పూర్తిగా బంద్ చేసినప్పటికీ రాత్రి వేళల్లో అధికంగా కురుస్తున్న మంచు కారణంగా చలికి వణికి పోవా లసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం ఎనిమిది గంటలు దాటితే తప్ప.. సూర్యుడు ఉదయించడం లేదు.

జిల్లాలో 10.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు..

జిల్లాలో బుధవారం 10.2డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోటపల్లి మండలం తపాల్పూర్లో అత్యల్పంగా 10.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, జైపూర్ మండలంలో 10.7 డిగ్రీలు, వేమనపల్లి మండ లం నీల్వాయిలో 10.8డిగ్రీలు, జన్నారం మండలంలో 10.9డిగ్రీలు, కోట పల్లి మండలం దేవులవాడలో 11.0డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి కార్పొరేట్ దుష్టశక్తులను రానివ్వం

గర్మిళ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్,మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసే కార్పొరేట్ దుష్టశక్తు లకు విద్యార్థి లోకం గుణపాఠం చెబుతుందని ఓయూ జేఏసీ వైస్చైర్మన్ రామగిరి శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈప్రాంతంలో కార్పొరేటర్ విద్యాసంస్థలను స్థాపించడమే కాకుండా ఇక్కడి విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు.

నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని లేమూరు, గుడిపల్లి, ఎమ్మెల్యే కాలనీలను కలిపి నూతన గ్రామపంచాయతీని ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కార్యాలయం వద్ద వెంకటాపూర్ గ్రామస్థులు ఎమ్మెల్యే వివేక్వెంకటస్వామికి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే వివేక్వెంకటస్వామికి బుధవారం ఎంపీడీవో రాజేశ్వర్ ఘనంగా స్వాగతం పలికారు.

'లక్ష డప్పులు.. వెయ్యి గొంతు'లను

విజయవంతం చేయండి: మంద కృష్ణ మాదిగ

బెల్లంపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్లో ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం రాత్రిపట్టణంలోని వైశ్యభవన్లో మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల నాయకులతో సన్నాహకసదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదిగల బలప్రదర్శన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి రెండు జిల్లాల నుంచి పెద్దఎత్తున మాదిగలు, ఉప కులాలు, డప్పుకళాకారులు, రచయితలు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ప్రభుత్వం వర్గీకరణకు కట్టుబడి ఉండి వెంటనే చేపట్టాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణ పూర్తయ్యే వరకు వివిధ కార్యక్రమాలు చేపడతామన్నారు.లక్ష డప్పులు,వెయ్యి గొంతుకల భారీబహిరంగ సభను చరిత్రలో నిలిచిపోయేవిధంగా విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరిసమ్మయ్య, ఇన్చార్జీ సతీష్ మాదిగ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, సీనియర్నాయకులు చిలుముల శంకర్, నాతరిస్వామి, ఈ శంకర్, సీపీఐ నాయకులు రేగుంట చంద్రశేఖర్తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మున్సిపాలిటీ ఎన్నికల కోసం దశలవారీ పోరాటాలు

మందమర్రి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికల సాధనకు దశలవారీ ఆందోళనలను చేపట్టడానికి మున్సిపల్ ఎన్నికల సాధనకమిటీ నిర్ణయం తీసుకుందని నాయకులు పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ న్యాయపరమైన చిక్కులు తొలగించి ఎన్నికలే ఏకైక ఎజెండాగాముందుకు వెళ్తామన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు: ఎమ్మెల్యే వివేక్

మందమర్రి టౌన్/రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వపథకాలను అందజేస్తామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణంలోని8,7, వార్డుల్లో నిర్వహించిన వార్డుసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీ తట్టుకోలేక పోతోందని మండిపడ్డారు. పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్లసర్వే చేస్తున్నామని తెలిపారు. అర్హులెవరు కూడా నష్టపోవద్దనేదే తమ సిద్ధాంతం అన్నారు. ఇప్పటికే కొంత మంది నుంచి ఫిర్యాదువస్తే వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఈ వార్డు సభలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు కూడా వార్డు సభల విజయవంతానికి ప్రణాళికబద్ధంగా పనిచేయాలని తెలిపారు. అనంతరం ఆయన 7వవార్డులో పాదయాత్ర నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ మోడల్హౌజ్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే నల్లాలఓదెలు, తహసీల్దార్ సతీష్కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్, కాంగ్రెస్నాయకులు సొత్కు సుదర్శన్, గందె రాంచందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్బండ్ అభివృద్ధికి కృషి చేస్తా..

మందమర్రి టౌన్: పట్టణంలోని మినీ ట్యాంక్బండ్పై వాకింగ్ ట్రాకు ఏర్పాటుకు కృషి చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం వాకర్లతో కలిసి మార్నింగ్వాక్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పట్టణప్రజల ఆహ్లాదంకోసం పార్కుల ఏర్పాటుకు దృష్టి పెట్టానన్నారు. ట్యాంక్బండ్పై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి సదానందం, సభ్యులు పాల్గొన్నారు.

జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి..

జైపూర్: మహాశివరాత్రి సందర్భంగా వేలాలజాతరకు వచ్చేభక్తులకు అన్నిసౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం మండలంలో జాతరఏర్పాట్లను కలెక్టర్ కుమార్దీపక్తోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేలాల జాతరను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వీఐపీ వాహనాలను గుట్టపైకి పంపకూడదన్నారు. దేవునిదర్శనానికి అందరు సమానులేనని, దేవునిదగ్గర ఎవరూ వీఐపీలు కాదన్నారు. ఆలయ ఈవో రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతోపాటు అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీపీభాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఏ ఫ్వో శివ్ఆశిశ్సింగ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మందమర్రి టౌన్: మినీ ట్యాంక్బండ్ వద్ద వాకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

గందరగోళంగా గ్రామసభలు

● భీమారం గ్రామంలో రేషన్ కార్డుల జాబితాలో భారీగా తప్పులు

భీమారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భీమారం గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో గందరగోళం నెలకొంది. అర్హుల పేర్లు జాబితాలో లేవని, దరఖాస్తుల్లో తప్పులు దొర్లాయని గ్రామయువకులు గందరగోళం సృష్టించారు. తమకు న్యాయం జరగడం లేదని సభను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. రేషన్కార్డుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, సంపన్నుల పేర్లువచ్చాయని తమ పేర్లు ఎందుకు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఇప్పటికే ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా న్యాయం జరగడం లేదని, తమకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ సదానందం రేషన్కార్డుల్లో మార్పులు చేర్పులు ఉంటాయని, నూతనంగా పెళ్లి చేసుకున్నవారికి సైతం రేషన్కార్డులు అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. అనర్హులుంటే తమకు తెలియజేయాలన్నారు. రేషన్కార్డుల దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. సభలో ఎలాంటి అవాంఛనీయ సంటనలు జరగకుండా ఎస్ఐ శ్వేత బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మండలప్రత్యేకాధికారి కల్పన, ఎంపీ డీవో మధుసూ దన్, ఎంపీవో సతీష్రెడ్డి, ఏవో సుధాకర్, ఆర్ఐ స్రవంతి, ఏపీవో జీనత్, నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలో మొదటిరోజు గ్రామసభలు ప్రశాంతంగా ముగిసినా రెండవ రోజు దేవాపూర్, మల్కేపల్లి పంచాయతీల్లో రేషన్కార్డుకు అర్హత ఉన్నా జాబితాలో పేర్లు లేకపోవడంతో అధికారులు, అధికారపార్టీ నాయకులపై మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. దేవాపూర్ పంచాయతీ పరిధిలో సిమెంటు కంపెనీలోని పర్మినెంటు ఉద్యోగులు, లోడింగ్ కార్మికులతోపాటు స్థానికేతరులకు అత్యధికంగా రేషన్ కార్డులు మంజూరు కావడంపై స్థానికులు అధికారులను నిలదీశారు. మల్కేపల్లికి చెందిన రొడ్డ తిరుపతికి అన్ని అర్హతలున్నా జాబితాలో పేరు రాకపోవడాన్ని నిరసిస్తూ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసనతెలిపారు. అనర్హులను జాబితానుంచి తొలగించి అర్హులకు రేషన్కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మండల కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామన్నారు.

జన్నారం: మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు రసభాసగా జరిగాయి. రేండ్లగూడ గ్రామంలో నిర్వహించిన సభ రసభాసగా మారింది. గ్రామస్థులు ఇందిరమ్మఇండ్లు, రేషన్కార్డుల్లో తమపేర్లు లేవని అధికారులను నిలదీశారు. అధికారులు స్పందించి అర్హత ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తామనిచెప్పారు.ఈ సందర్భంగా కాంగ్రెస్నాయకులు, ప్రజలమధ్య కొద్దిసేపు వాగ్వాదం నెలకొనగా అధికారులు సర్దిచెప్పారు.

అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు

దండేపల్లి: అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామని మండల తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో జేఆర్ప్రసాద్ అన్నారు. మండలంలోని పలు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో బుధవారం ప్రజాపాలనలో భాగంగా సంక్షేమ పథకాల ఎంపిక కోసం గ్రామసభ నిర్వహించారు. సంక్షేమ పథకాల పథకాల విషయంలో ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ అందించే విధంగా కృషి చేస్తామన్నారు.



భీమారంలో అధికారులను న్యాయం చేయాలని కోరుతున్న మహిళ

గ్రామాన్ని కార్పొరేషన్లో విలీనం చేయొద్దు

హాజీపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో బుధవారం ప్రజాపాలన గ్రామసభ పోలీసుల బందోబస్తు మధ్య కొనసాగింది. గ్రామసభలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాను అధికారులు చదివి వినిపించారు. గ్రామస్థులు అధికారులను ముట్టడించి గ్రామపంచాయతీకార్యదర్శి డప్పుడు చాటింపువేయకుండా, గ్రామసభ పెట్టాడన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు అనుకూలంగా తీర్మాణం ఇచ్చారని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. దీంతోతహసీల్దార్ గ్రామస్థులతో మాట్లాడుతూ కలెక్టర్ గ్రామాన్ని సందర్శిస్తారని అప్పుడే తుది నిర్ణయం ఉంటుందని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని భరోసా కల్పించి వెళ్లిపోయారు. కొద్ది సేపటికి మరల గ్రామస్థులు నర్సింగాపూర్ పంచాయతీ కార్యదర్శి, మండల పంచాయతీ అధికారులను ముట్టడించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు కార్యదర్శిని పంచాయతీ కార్యాలయంలో ఉంచి గ్రామస్థులను సము దాయించారు. మహిళలు తమకు సమాధానం చెప్పాలని అడగడంతో చేసేదేం లేక కొంతమంది మహిళలను కార్యదర్శి వద్దకు పంపించడంతో గొడవ సద్దుమణిగింది. గ్రామస్తులు మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్లో తమ గ్రామాన్ని విలీనం చేస్తే ఉపాధి హామీ పథకం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని పంటపొలాలతో కళకళాడే తమగ్రామాన్ని కార్పోరేషన్లో కలుపొద్దనిపేర్కొన్నారు. వెంటనే సర్వే చేసి విలీన ప్రక్రియను రద్దు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.



నర్సింగాపూర్ గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్, తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్పాండే


రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

కాసిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వహనదారులు రోడ్డుభద్రత నియమాలు పాటించాలని మంచిర్యాల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఖాసీంసాహెబ్ అన్నారు. బుధవారం కాసిపేట జూనియర్కాలేజీలో విద్యార్థులకు రోడ్డుభద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్, సీటుబెల్టు ధరించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ సూర్యతేజ, కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

బెల్లంపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా గురుకులాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలకు వచ్చిన ఉమ్మడి ఆదిలాబాద్జిల్లా ఆర్సీవో గోపిచంద్కు వినతిపత్రం అందించారు.

శివాలయంలో సంబరాలు



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చెన్నూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామ మందిరంలో బాలరాముని విగ్రహప్రతిష్ఠజరిగి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా చెన్నూరుపట్టణంలోని శివాలయంలో సంబ రాలు నిర్వహించారు. ఆలయంలోదీపాలు వెలిగించిగుడి ఆవరణలో శ్రీరామఅంటూ దీపాలంకరణ చేశారు. అనంతరం భజన కార్యక్ర మాలు నిర్వహించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మందమర్రిరూరల్,జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రకుంటగ్రామంలో బుధవారం ఈజీఎస్ నిధులు రూ.3లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణపనులను బ్లాక్కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్,మాజీ సర్పంచు ఒడ్నాల కొమురయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

బెల్లంపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య పేర్కొన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో మార్చి 2024 టాపర్స్పోస్టర్లను, అడ్మిషన్ డ్రైవ్ కరపత్రాలను విడుదలచేసి మాట్లాడారు. ప్రభుత్వకళాశాలల్లో అనుభవంగల అధ్యాపకులతో బోధన జరుగుతుందని తెలిపారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య, సీనియర్ లెక్చరర్ కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్సోమయ్యలైబ్రేరియన్ నరేంద్రకుమార్,అధ్యాపకులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య

ఆర్టిస్టు వెన్నెలకు ఇన్స్పిరేషనల్ గర్ల్ చైల్డ్ అవార్డు


జైపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం గ్రామానికిచెందిన ప్రముఖ ఆర్టిస్టు చిప్పకుర్తి శ్రీనివాస్ కుమార్తె చిప్పకుర్తి వెన్నెల ఇన్స్పిరేషనల్ గర్ల్చైల్డ్ అవార్డు అందుకుంది. ఇటీవల హైదరాబాద్లోని బిర్లా ప్లానిటోరియంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న బాలికలను ప్రోత్సహిస్తూ ఇన్స్పిరేషనల్ గర్ల్చైల్డ్ అవార్డులను అందించగా వెన్నెల సినీనటి కవిత చేతుల మీదుగా అవార్డును అందుకుంది. కాగా వెన్నెల తండ్రికుందారం ప్రభుత్వపాఠశాలలో ఆర్టిస్టుటీచర్గా విధులునిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా వెన్నెలను జిల్లాఆర్టిస్టు అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



సినీ నటి కవిత చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెన్నెల

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

3

గురువారం 23 జనవరి 2025

మెరుగైన వైద్యం అందించాలి

చెన్నూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోగులకుమెరుగైన వైద్యం అందించాలని జిల్లావైద్యాధికారి అనిత అన్నారు. అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీని బుధవారం సందర్శించారు. రిజిష్టర్‌లను తనిఖీచేశారు. ప్రతిరోజు వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించారు. ఆమెవెంటవైద్యులు కృష్ణతేజ, సబ్‌యూనిట్ అధికారిజగదీష్, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గర్మిళ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంచిర్యాల మాజీఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న రిలేనిరాహార దీక్షకు బుధవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూ కార్మికులు 20సంవత్సరాలుగా సంస్థను నమ్ముకుని పనిచేస్తున్నారన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గాదెసత్యం, గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, ఎడ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు

హాజీపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని కర్ణమామిడి, నంనూర్ గ్రామాల్లో గ్రామసభలు బుధవారం నిర్వహించారు. సభలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా జాబితానుకార్యదర్శులు చదివి వినిపించారు. కర్ణమామిడిలో నిర్వహించిన ప్రజాపాలనలో అదనపుకలెక్టర్ మోతీలాల్‌పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమపథకాలు అందుతాయన్నారు.

నేడు రక్తదాన శిబిరం

తాండూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఈనెల23న మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్‌హాలులోరక్తదాన శిబిరం నిర్వహిస్తామని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్‌ఒక ప్రకటనలో తెలిపారు. 9014443974, 8688814328లో పేర్లునమోదు చేసుకోవాలన్నారు.



వామ్మో చలి..!

- 10 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- నాలుగు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
- ఉదయం, సాయంత్రం వేళల్లో అధికమవుతున్న తీవ్రత
- ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
- వృద్ధులు, పిల్లలకు తప్పని ఇబ్బందులు

జిల్లాలో చలి విజృంభిస్తోంది. ఉదయం 9అయితే గానీ సూర్యుడు కనిపించడం లేదు. ఉదయం సాయంత్రం చలికి పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ఐదింటికే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అవసరమైతే తప్ప వృద్ధులు, చిన్నారులు సాయంత్రం పూల బయటికి వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

మంచిర్యాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు రోజులుగా చలి విజృంభిస్తోంది. క్రమేపీ ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో ప్రజలు చలిబారిన పడుతున్నారు. ఈ యేడు ఇప్పటి వరకు లేని విధంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో మరింతగా చలి పెరుగుతుండటంతో ఇళ్లనుంచి బయటకు వెళ్లాలం టేనే ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతల్లో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం 9గంటల వరకు కూడా చలి ప్రభావం ఉండటంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం 6గంటల నుంచే చలి ప్రభావం కనిపిస్తోంది. శీతల గాలుల కారణంగా పిల్లలు, వృద్ధు లు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తర ఈశాన్య దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా చలి ప్రభావం అధికంగా ఉంటోంది.

ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు..

ఒకేసారి చలి తీవ్రత పెరగడంతో ముఖ్యంగా వివిధరంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉదయం, రాత్రి షిఫ్టులకువెళ్లే సింగరేణి కార్మికుల తోపాటు కూరగాయలు, పాలు విక్రయించి జీవనం సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైనా చలి ప్రభావం అధికంగా ఉంటోంది.

విపరీ తమైన చలి కారణంగా సింగరేణిలో గైర్హాజరు శాతం క్రమంగా పెరుగుతోంది. పాలు, కూరగాయల వ్యాపారులు తెల్లవారుజామున ఐదుగంటలకే బయటకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బం దులు తప్పడం లేదు. ఉదయం 10గంటల వరకు కూడా రోడ్లపైకి జనాలు వచ్చేందుకు సాహసించడం లేదు. కాగా విపరీతంగా పెరిగిన చలి కారణంగా వృద్ధులు, పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు...

మిగతా 5లో

విచ్చలవిడిగా మాంసం విక్రయాలు

- నిబంధలకు బేఖాతర్
- పట్టించుకోని అధికారులు

5



పెరటికోళ్ల పెంపకం.. లాభదాయకం

- ఆసక్తి చూపుతున్న రైతులు
- కోళ్ల ఫారం నిర్మాణానికి ఈజీఎస్ చేయూత

4



రాజ్యాంగాన్ని మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యులు, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని మార్చడమే ఏకైక లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ పనిచేస్తున్నాయని సీపీఐ జాతీయసమితి సభ్యుడు, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారత కమ్యూనిస్టుపార్టీ శతాబ్దిఉత్సవాల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టులు ఈదేశంలో ఉండకూడదని, ప్రజలకు కమ్యూనిస్టులను దూరం చేయాలని బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. 2014లో వాజ్‌పేయి, ఇప్పుడు మోదీప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్నారన్నారు. కమ్యూనిస్టుపార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్రజలు, కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేస్తుందన్నారు. మనందరం ఐక్యమైతే ఈదేశంలో సెక్యులరిజం ఎజెండాతో సమసమాజ న్యాయం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కలవేన శంకర్, జిల్లాకార్యదర్శి లక్ష్మణ్, నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, మేకల దాసు, కలీందర్‌ఖాన్, మల్లయ్య పాల్గొన్నారు.

మేధస్సుకు పదును పెడితేనే నూతన ఆవిష్కరణలు

- జిల్లా సైన్సు అధికారి మధుబాబు



పిల్లల ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఎస్‌వో మధుబాబు

నెన్నెల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మేధస్సుకు పదును పెట్టి కొత్త ఆవిష్కరణలు రూపొందించాలని జిల్లా సైన్సు అధికారి మధుబాబు అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆవడం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో డీఎస్‌వో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల్లోని సృజనను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రకృతిని చూసి చాలా నేర్చుకోవచ్చన్నారు. పక్షులు గూడుకట్టుకోవడంలో గొప్ప ఆర్కిటెక్చర్ దాగిఉందన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, జిజ్ఞాస మొబైల్ ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు జాకిర్ హుస్సేన్ ఉన్నారు.

గిరిజన విద్యార్థులపై కాంగ్రెస్‌ది సవతితల్లి ప్రేమ

దండేపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన విద్యార్థులపై సవతితల్లిప్రేమ చేపిస్తున్నదని గిరిజన విద్యార్థి జాతీయ అధ్యక్షుడు ఇంథల్ రాథోడ్ అన్నారు. బుధవారం దండేపల్లిలో ఆయన మాట్లాడుతూ గతప్రభుత్వంతో పోలిస్తే ఈప్రభుత్వం గిరిజన విద్యార్థులకు చేసిందేమీ లేదన్నారు. ఉమ్మడిఆదిలాబాద్ జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలకు రెగ్యులర్‌వార్డెన్లు, ఆశ్రమగర్ల్స్‌హాస్టల్స్ కూడా రెగ్యులర్ వార్డెన్లు లేరన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి: సీపీ



బాధితురాలికి ఫోన్ అందజేస్తున్న సీపీ

మంచిర్యాల క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదుచేయగా ఆయా సెల్‌ఫోన్లను సీసీఎస్, ఐటీసెల్ బృందాలు స్వాధీనం చేసుకొన్న బుధవారం వారికి అందజేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా పోగొట్టుకున్న, దొంగలించబడిన సెల్‌ఫోన్ల ఆచూకీ కనుగొని స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ యజమానులకు అందజేశారు. రామగుండం కమిషనరేట్‌పరిధిలో ఇప్పటివరకు 5280సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదుచేయగా ఇందులో ఇప్పటివరకు 1538సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని యజమానులకు అందజేశామన్నారు. మొబైల్‌ఫోన్ రికవరీలో పాల్గొన్న సిబ్బందిని సీపీ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటి సెల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధం..

మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ ఎంశ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజల సొమ్ముదోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త కొత్త పద్ధతులను ప్రయోగిస్తున్నారన్నారు. ఇలాంటివాటిని నియంత్రించాలంటే వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్‌వంటి సోషల్ మీడి యాలో వచ్చే అనుమానిత లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లుగా భావిస్తే తక్షణమే 1930టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే వినోద్

తాండూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమపథకాలు అందుతాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. బుధవారం అచ్చలాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు అర్హులైన వారికి అందిస్తామన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతరం ప్రక్రియ అని తెలిపారు. రాష్ట్రంలో 40లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని తెలిపారు. సంవత్సరకాలంలో 20రోజులు ఉపాధిహామీ పని చేసిన భూమిలేని నిరుపేదలందరికీ సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్నారు. గ్రామసభల్లో కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇండ్లకు దరఖాస్తులుచేసుకుంటే వాటిని కూడా పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమాలన్నీ నిరంతరం కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో, ఏసీపీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం పట్టణంలోని 22వార్డులో జరిగిన ప్రజాపాలన వార్డుసభలో కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అంది స్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేత, ఏసీపీరవికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిమంద స్వరూప రమేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసాకు 5909, రైతు భరోసా 51534, కొత్త రేషన్ కార్డులు 5883, ఇందిరమ్మ ఇండ్లు 39517 మంది ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈపథకాలన్నీ ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అర్హుల లిస్టులోపేర్లురాని వారు ఆందోళన చెందవద్దని గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ముచ్చర్ల మల్లయ్య, సీనియర్ నాయకులు నాతరి స్వామి, తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

మెరుగైన వైద్యసేవలకు వైద్యులు కృషిచేయాలి..

బెల్లంపల్లి: ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. బుధవారం ప్రభుత్వ వందపడకల ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నిర్వ హిస్తున్న ఉచిత కంటిపరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, శ్రీధర్, నాయకులు బండి ప్రభాకర్, ముచ్చర్ల మల్లన్న, బొమ్మెన హరీష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

5శాతం రిజర్వేషన్ కల్పించాలి..

కాసిపేట: ప్రభుత్వం చేపట్టే ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డంవినోద్‌కు వికలాంగుల సంఘం నాయకులు వినతిపత్రం అందించారు.

నిఘా నీడలో ప్రయోగం

- సీసీ కెమెరాలు ఏర్పాటు

కోటపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియల్‌లో ఈ యేడాది నుంచి ప్రయోగపరీక్షలు సీసీ కెమెరాలో పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకుంది. ప్రయోగాలన్నీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిపేందుకు ఇందులో భాగంగా ప్రతి కళాశాలకు రూ.25వేలు వెచ్చిందింది. వీటి ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటు జరగనుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ప్రయోగాల కోసం కళాశాలలకు రూ.25వేల నిధులు ప్రిన్సిపల్ ఖాతాలో జమ చేయగా, ఈ నిధులతో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఈ ఏడాది ప్రయోగ పరీక్షలు మరింత పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 3వతేదీ నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ప్రభుత్వకళాశాలలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో మొత్తంగా 62 కళాశాలలు ఉండగా పది ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పరిధిలోకి వచ్చే గురుకులాలు, జ్యోతిబాపూలే కళాశాలలు, కస్తూర్బా, ట్రైబ ల్ వెల్ఫేర్, ఆదర్శ కళాశాలలు కలిపి 35 ఉన్నాయి. అలాగే ప్రైవేటు కళాశాలలు 17 ఉన్నాయి. వీటిలోనూ సీసీ కెమెరాలను అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో భౌతిక రసాయన శాస్త్రాలకు ఏడాదిలో 20 చొప్పున, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రా లకు సంబంధించి ఏడాదికి 12తర గతుల చొప్పున విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తారు. విద్యార్థులు ప్రయోగశాలలో నేర్చుకున్న అంశాలను పరీ క్షలో ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. ఇందులో సాధించిన మార్కులు విద్యార్థు లకు ఎంతో కీలకం కానున్నాయి. ఈ పరీ క్షలను ఇంటర్మీ డియట్ బోర్డు పర్యవేక్షించనుండగా సీసీ కెమెరాల ద్వారా జిల్లా కేంద్రానికి అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో నిఘా పెట్టనున్నారు. దీంతో నిఘానీడలో ప్రయోగాలు జరగనున్నాయి.



ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

పారదర్శకంగా ప్రయోగ పరీక్షలు..



ఈ సంవత్సరం ఇంటర్ కళాశాలల్లో ప్రయోగపరీక్షలను పారదర్శకంగా జరిపేం దుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పా టుకై రూ.25వేల చొప్పున నిధులు మంజూ రు చేశాం. వీటితో నాలుగు కెమెరాలను తప్పని సరిగా ఏర్పాటు చేయాలి. పరీక్షలకు ముందు అన్నిరకాల ఏర్పాట్లు చేసి తని ఖీలు చేపడతాం.

- కె అంజయ్య, డీఐఈవో, మంచిర్యాల

ఈటల రాజేందర్‌ను విమర్శిస్తే ఊరుకోం

జన్నారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను విమర్శిస్తే ఊరుకోమని ముదిరాజ్ మహాసభరాష్ట్ర ప్రధానకార్యదర్శి సలేంద్ర శివయ్య, ముదిరాజ్ అఖిల భారత కోలి సమాజ్ జాతీయ కార్యవర్గసభ్యుడు బొజ్జ నారాయణ ముదిరాజ్ అన్నారు. బుధవారం జన్నారం మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ ఈటల రాజేందర్‌పై మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ చేసిన అసత్య ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కమీషన్‌లకు కక్కుర్తిపడే నాయకుడు ఈటలరాజేందర్ అని అనడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మాటలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో నాయకులు శ్రీధర్,రవి,కిరణ్,మురళీ,రమేష్, తిరుపతి, చంద్రమౌళి, భీమరాజ్‌పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీకి ఘన స్వాగతం

నస్పూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పూర్తిచేయాలని కోరుతూ బెల్లంపల్లి వరకు బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ర్యాలీకి నస్పూర్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వచ్చేనెల7న హైదరాబాద్‌లో నిర్వహించే భారీబహిరంగసభ ఏర్పాట్లలో భాగంగా ర్యాలీచేపట్టినట్లు తెలిపారు. ర్యాలీకి అవసరమైన రథాన్ని రామగిరి శ్రీపతి తయారు చేయించి ఉద్యమంకోసం అం దించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి చుంచు శంకర్ వర్మ, అట్కుపురం రాయలింగు, చంద్రగిరి నరేష్ పాల్గొన్నారు.

పత్రికలు ప్రజల పక్షాన ఉండాలి

- పత్రికా స్వాతంత్రాన్ని రాజ్యాంగ పుటలలో బంధించవద్దు
- సమాజానికి జర్నలిస్టు డాక్టర్
- తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మంచిర్యాల క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పత్రికలు ప్రజలపక్షాన ఉండి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే వారధిగా పనిచేయాలని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాకేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో గల నార్త్‌ఇన్ హోటల్‌లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట (ఐజెయు) మంచిర్యాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజాస్వామ్యంలో మీడియా బాధ్యతపై నిర్వహించిన సెమినార్‌కు హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రెస్ అకాడమీచైర్మన్ మాట్లాడుతూ పత్రికా స్వాతంత్రాన్ని రాజ్యాంగ పుటలలో బంధించవద్దని, ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యల సాధన దిశగా ోడ్పాటు అందించాలన్నారు. సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. సమాజానికి జర్నలిస్టు డాక్టర్ వంటివాడని, దెబ్బతిన్న సమాజాన్ని ఆరోగ్యంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు చేసే ప్రజా వ్యతిరేక ధోరణిని ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా ప్రజలకు వివరించి సమాజాన్ని తీర్చిదిద్దుదామని అన్నారు. వార్తలలో అవాస్తవాలతో గౌరవం సన్నగిల్లుతుందని, స్తబ్ధతలేని ప్రవర్తనతో వ్యవహరించవద్దని అన్నారు. ప్రభుత్వం, న్యాయం, అధికారాలలో నెలకొన్న అవినీతిని ఎత్తిచూపేది మీడియా మాత్రమేనన్నారు. మీడియాపై జరుగుతున్న దాడులగురించి ప్రతి జర్నలిస్టు కచ్చితంగా ఆలోచించి సరైన నిర్ణయంతో ముందుకుసాగాలని తెలిపారు. రాజ్యాంగంలో పేర్కొన్న ఆర్టికల్19-1ఎ ప్రకారం అందించిన పత్రికస్వేచ్ఛను సమర్థవంతంగా వినియోగిం చుకుని సమాజశ్రేయస్సు దృష్ట్యా వర్కింగ్ జర్నలిస్టులుగా తమదైన ముద్రవేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకుడు నగునూరి శేఖర్, రాష్ట్రకార్యవర్గసభ్యుడు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లాపౌర సంబంధాల అధికారి జె శారద, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్‌రెడ్డి, కోశాధికారి కేశెట్టి వంశీ కృష్ణ, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.